
# కిర్రుచెప్పులూ_ కుక్కగొడుగులూ

డా. కొమరవోలు వెంకట సుబ్బారావు



అందానికి, అవశ్యానికి ఏం సంబంధం?

అందగత్తె బహుమానం అందుకున్నది తను... అందుకేగా మేనత్త మొజావడి కొడుక్కు అంటగట్టుకున్నది!

అందానికి బలి శిక్షా?

పిల్లలు పుట్టకపోతే తనేం చేస్తుంది? ఆ వంశానికి ఆయన ఒక్కడే మిగిలి ఉన్నాడు.. ఆ మాట అందరికీ తెలును... ఆయనకీ తెలును...

లేడీ డాక్ట రంటుంది... తనలో ఏ లోపం లేదని.

మగ డాక్ట రంటాడు బాపిరెడ్డికీ లోపం లేదని.. మరి?

పెళ్లినాటి అట్లాంటిక్ మహాసముద్రం లాంటి ఆస్తి అంతా హరించుకుపోయింది. పోగా మిగిలినవి పదో అంతస్థులోని ఫ్లాటు ఒకటీ.. ఆ నలభై ఎకరాల అంబ్రికా. అందులోని జాల్ జబీరూ.

పురుటిబిడ్డ కంటే గాఢంగా ప్రేమిస్తారు బాపిరెడ్డి జాల్ జబీరును.. అంతే గాఢంగా తననూ...

పోర్టికోలో కూర్చుని బైనాక్యులర్‌తో వీధి వెంట చూస్తున్నది పావని. క్రింది వీధిలో దూరాన ఎర్రని నలక ఒకటి కనిపిస్తున్నది.

మేనత్త కాదు గదా!

అవును... ఆమే..

ప్రొద్దున ఆరింటికే బయల్దేరింది. వర్ణన కందని వినుగు, కోపం, అనంతృప్తీ... ఆ ముఖం?

బైనాక్యులర్‌ను పక్కన పెట్టేసింది.

*** *** ***

"పొలక కీలక యంత్రాంగంలో భామకలాపం పోటీలూ.

కూలీ నాలీ మందే కడుపుకు కుక్కగొడుగు బన్ రోటీలూ!"

పత్రికలో పై పంక్తులను చదువుతూ, ఫేవరిట్ ఎగారికస్ డిష్‌తో నాస్తా చేస్తున్న బాపిరెడ్డి ఆలోచనా సముద్రంలో తిమింగలం గెంతింది.

"దుబాయ్ నుంచి ఫాక్స్ వచ్చిందండి. మన మా ఫాక్టరీని కొన్ని రోజులు మూసేస్తున్నారట."

"ఏం కథ? అగ్ని ప్రమాదమా? స్ట్రైకులా? మరమ్మతా?" ఆశ్చర్యంగా అడిగాడు బాపిరెడ్డి.

"అదేదీ కాదు, తోళ్ళ కరువట." నోటి నుండి ఆ మాటను ఊడదీసి పడెయ్యడానికి భైరవయ్యకు అర నిమిషం పట్టింది.

"మన వెధవలేం చేస్తున్నారు?" మండిపడ్డాడు బాపిరెడ్డి. "తలకు పదేసి రూపాయలు పెంచానని చెప్పు. కావల్సిన సరుకంతా ల్యాబ్ నుండి పట్టుకెళ్లమను. పెటాను సంప్రదించు. కనీసం ఏడు వందల దేహాలయినా ఎల్లుండి ప్రొద్దుటికల్లా ఫాక్టరీకి చేరుకోవాలి. అర్థమయిందా?"

బాపిరెడ్డి మాటకు మారులేదు.

"కార్పొరేషను... తైనాతీలు... ఆరోగ్య శాఖామాత్యులు... అస్తాగుంలు..."

"ఆ ఈడువులన్నీ నాకు వదిలెయ్. నీ ఏడుపు నీవు ఏడు."

"పది చాల దంటారండీ" భైరవయ్య.

"పదిహేను.. మరి పెంచక... మళ్లీ కనిపించకు." భైరవయ్య బలగం మృత్యు దేవత స్వయంగా తర్ఫీదు చేసిన యాక్షన్ ఫోర్సు పులగం.

మర్నాడు పట్టణంలో ఏ వీథిలో చూచినా అవారా పశువులు నోట రక్తం గ్రక్కుకుని పడి ఉన్నాయి.

ఆరోగ్య శాఖామాత్యులు నిర్ఘాంతపోయారు. డెంభై కోట్ల జనాభాలో ఏ కొంచెం శాతమో మనుషులు చస్తే ఇబ్బందిలేదు కాని, రోజూ క్షీణించి పోతున్న పశువుల జనాభా ఏమాత్రం తగ్గినా సమస్యే... చచ్చిన పశువుల కుటుంబాలకు [అది వరకే అచ్చయి, కట్టల్లో దాక్కుని, 'పదండి ముందుకు' అని కేకలు వేస్తున్న సందేశ పత్రాల మీద రోజూ ఇదేపనా.. అని విసుక్కుంటూ] శ్రీవారు తమ ప్రగాఢ సుదీర్ఘ సంతాపాలను వ్యక్తం చేశారు. రిటైరైన న్యాయమూర్తి చేత హుటా హుటిగా విచారణ జరిపించడానికి కమిటీని వేశారు.

ఆ కథ నంతా తమ పైత్యంతో జోడించి శ్రద్ధాపూర్వకంగా మంత్రి గారి ఫోటోతో సహా పత్రికలన్నీ అచ్చువేశాయి.

మృత పశువుల పీడను వీథుల నుండి తొలగించడానికి సమయం లేనందున కార్పొరేషన్, ఖామందులు దాన్ని దండగ చాకిరి క్రింద జమకట్టేశారు. 'వెరీ ఎమర్జెంటు' కాగితాల మీద శానిటేషను హెల్తు శాఖలకు' ఆ పని చేయవలసినదిగా తాఖీదులు అందచేశారు.

శానిటేషను, హెల్తు [ఉన్నతాధికారులు ఖండాంతర పర్యటనలో ఉన్నందున] శాఖలు మేలుకునేసరికి మరొక రోజు దాటిపోయింది.

పశు కళేబరాలు ఊరుకుంటాయా? బాగా ఉబ్బి కుళ్లి, దుర్వాసన విరజిమ్మడం ప్రారంభించాయి.

మంత్రుల ఇళ్లలోనికి దుర్వాసన దూరడమే తడవుగా టెలిఫోన్‌లు గొంతు చించుకోడం ఆరంభించాయి.

"రబ్బిష లారీ లన్నింటికీ ఒకేసారి రోగాలు... ప్లేగులు... రావాలా? డ్రైవర్ల యూనియన్ ప్రెసిడెంటు సలహా మీద లారీలు పడుకొని నిద్రపోయాయట" అని పత్రికలు పుకార్లు లేవదీశాయి.

పశు దేహాల క్లీనింగు పనికి తప్పనిసరిగా, అసమ్మతితోనే ప్రైవేటు సంస్థల నుండి కొటేషన్ల కోసం కార్పొరేషను వారు ప్రకటనలు చేశారు.

ఒకే ఒక జాల్ జబీర్ ఆ పనికి చేతులు చాచి ఒప్పుకున్నది."

మర్నాడు అన్ని వీథుల నుండీ పశు దేహాలు గాయబ్..

భైరవయ్య బలగం నుండి బాపిరెడ్డి కందిన బిరుదం చెమ్చా సాహెబ్. కంట్రాక్టు తాలూకు తిలా దానఫలం.. తలా పిడికెడు పిడికెడు పంపకం అయిపోయింది.

నాలుగేళ్ళు గడిచినా ఈ సంఘటన నిన్న జరిగినట్లు ఉన్నది బాపిరెడ్డికి. ఈ నాలుగేళ్లలో పెళ్లి అయి పావని వచ్చి రసమయ జగత్తును కొత్తగా సృష్టించినా, పీడకల లాగా మరపు రాకుండా, ఏదో మూలన నక్కి కూర్చుని మనస్సుకు ఒక్కొక్కసారి శూలంగా తయారైంది ఆ స్మృతి.

తనూ, పావనీ పెనవేసుకొని, ఒళ్లుమరచి నిద్రపోతున్న రాత్రి అది. బర్రెలు, గొర్రెలు, ఆవులు, మేకలు, గాడిదలు అన్నీ ఒక చోట చేరి మీటింగు చేసి వాదించుకుంటున్నాయి.

"ఈ దుర్మార్గుడు మనం చచ్చిపోయినా, మన తోళ్ళ మీద బరువంతా మోపి తొక్కుతూ, మన్నింకా చంపుతున్నాడు. వీడి కే గతి రాసి ఉంచాడో భగవంతుడు" అన్నది ఒక గాడిద గొంతు.

"నా కథ వినండి, ఇక్కడ ఉన్న వారంతా. మిషనులో దూర్చి నా తల నరికేసి, పెద్దగా ఉన్న తలల గుట్ట మీదికి విసిరేశారు. తల ప్రాణం గుడ్లలో నుండి బయటబడడానికి తన్నుకు లాడుతున్నది. ఎర్రటి బంతులై గుడ్లు చూస్తూనే ఉన్నాయి.




"నా మొండాన్ని గాలిలో వ్రేలాడదీశారు. మెడ నుంచి కారే రక్తాన్ని డబ్బాల్లోకి పట్టారు. ఒక కాలును గిట్టదాకా నరికి ఏదో రబ్బరు గొట్టంలోకి దాన్ని దూర్చి క్లాంపులతో బిగించారు. కంప్రెసరు గాలి వదిలారు. పెట పెట లాడుతూ చర్మం అంతా కళేబరం [అస్థిపంజరం] నుండి విడిపోయింది. బెలూనులాగా ఉబ్బిపోయింది. గది నాలుగు మూలలా వదిలిన ప్రబలమైన వేడికి లోపల మాంసం ఉడికిపోయింది. గుడ్లలో కొట్టుకాడే తలప్రాణం ఉడికిపోతున్న మొండెపు ప్రాణాన్ని "బాగా ఉడికావా?" అని అడిగింది. ఇద్దరం కలిసి ఎదుట నిలబడి చూస్తున్న ఆ రెడ్డి రాక్షసుని గుండెల్లో జొరబడి చూశాం.

"హాయిరే! ఉండాలిసన చోట వాడికి గుండెలు లేవు. దుబాయ్ రూపాయలు. ఎలెక్షన్ పాపాయువులు..."

"పట్టమహిషీ! ఇన్ని మాటలు చెప్పుతున్నావు. నీకు బెలూన్లూ, యంత్రాలూ, కంప్రెసర్లు, ఇవన్నీ ఎలా తెలిశాయి? చదివే వాళ్ళు నవ్వుతారే!" అన్నది ఒక ఆవు.

"నవ్వనీ! వాళ్ళు మనుషులైతే! మనిషి నాకు తిండిపెట్టి చస్తే కదా! మండిపోయే ఆ కటిక పెంటపోగుల మీద కాగితాలన్నీ నమిలేదాన్ని. ఒకనాడు ఒక పెద్ద వీథినబడి పోతున్నా. అమ్మకం కోసం రోడ్డు వార బాట మీద పుస్తకాలు ఉన్నాయి. దుకాణదారు ఎవడూ లే డక్కడ. పరన పెట్టి వాటి నన్నింటినీ నమిలేశా! అందులో ఇంజనీరింగు, ఎలెక్ట్రానిక్సు, ఫిజిక్సు, మెడిసిన్, పాలిటిక్సు, ఎకనామిక్సు, ఏరోనాటిక్సు అన్ని శాస్త్రాల తాలూకు పెద్ద పెద్ద పుస్త కాలున్నాయి. అవన్నీ నా పొట్టలో అరిగిపోయాయి. పాలిటిక్సు ఎకనామిక్స్ గ్రంథాలు మాత్రం అరగలేదు. జ్ఞానదేవుడు మహిమం చేత వేదాలు పలికించాడంటే నమ్మే చదువరులు, కంప్రెసర్లు, బెలూన్లను నేను ఉటంకిస్తే ఎందుకు నమ్మరూ? అందుకని ఈ యంత్ర విద్యలు నా కేమీ కొత్తగాదు. మా అమ్మ

పాలను రోజూ కంప్రెసరు తోటిగా వీళ్ళు పితికేది!' అన్నది మహిష.

"తలకాయ పోతే ఊహాలు కూడా పోవాలిగా! మరి ఇంకా నీ కివన్నీ ఎలా గుర్తున్నాయి" అన్నది ఆవు మళ్లీ.

"నా తలా, కొమ్ములూ అందంగా ఉన్నాయని ముచ్చటపడి దుబాయ్‌లోని ముస్తాఫా తన ఇంటి పెద్ద హాలులో గోడకు తగిలించి ఉంచుకున్నాడు. అక్కడ నుంచే నేను మాట్లాడుతున్నా."

"చిత్రమే! తల అక్కడ ఉంటే ఇక్కడ ఎలా మాట్లాడుతున్నావే?" అన్నది ఆవు మళ్లీ.

"నీలాగే! నీ వెలా మాట్లాడుతున్నావు? చచ్చిన మన తోళ్లను రూపాయలుగా మార్చుకుని, చెప్పులుగా కుట్టించుకొని, కిర్రు మంటున్నా డీ రాక్షసుడు. వీడు చస్తే వీడి తోలు నయాపైసాకు కూడా అమ్ముడుపోదు" అన్నది మహిషి.

స్పష్టంగానే వినిపిస్తున్నది పశువుల సంభాషణ. ఇవ్వు రతనికి నిద్ర లేదు. ఒళ్లంతా చెమట పోసింది. రాత్రి పడుకోబోతూ తన కిర్రు చెప్పులను మంచం క్రింద బద్ధకించి వదిలేసి పడుకున్నాడు. చెప్పులలోని తోలుముక్కల నుంచే ఆ పశు స్వరాలు పలుకుతున్నాయి. చెప్పులను ముట్టుకోడానికి కూడా రెడ్డికి భయం వేసింది.

కొన్ని నెలల క్రితం అమాత్యవర్యులకు పూజా సుమాలుగా మహిళా సంఘం సభా వేదికపైకి విసిరివేయగా, ఆయన వాటిని గౌరవ చిహ్నాలుగా స్వీకరించి వేలం పాట పెట్టగా, 5,000 /- రూకలకు పాట పాడి తాను కొని తెచ్చుకున్న కిర్రు చెప్పుల జత అది. చాలా విలువైనది. చెప్పులు కిర్రు కిర్రు మంటుంటే మంత్రిగారు మాట్లాడుతున్నట్లే ఉంటుంది తనకు.

కంగారుగా మంచం మీద దృష్టి సారించాడు బాపిరెడ్డి. పావని పావనిలాగా కనిపించడం లేదు.

*** *** ***

తల్లి చెప్పుకుపోతున్నది.

"దాని కడుపు పండితే వంశాంకురాన్ని చూచుకుని నిశ్చింతగా కన్నులు మూద్దామని కనిపెట్టుకుని ఉన్నారా! పెళ్లయి పదేళ్లయినా అలూ లేదు చూలూ లేదు. నీ వాలకం నా కర్థం కావడంలేదు. బుచ్చిరెడ్డి గారి అమ్మాయి అరుంధతి సంబంధం మాట్లాడి వచ్చా. ఆ అమ్మాయి మనింటి కోడలు కావడానికి ఉర్రూత లూగుతున్నది."


అమ్మ మాటలు విషాన్ని దట్టించుకొన్న అమృత గుళికల లాగా ఉన్నాయి.

"ఆ అరుంధతి కడుపూ పండకపోతే ఇంకో వసుంధరను తెస్తావా అమ్మా! నా నేరానికి పావని ఏం జేస్తుంది? యమధర్మరాజుల వంశం పెరిగితే ప్రాణికోటి గతి ఏమిటి?"

"డాక్టరు లక్ష్మి చేసేది బిడ్డలను పుట్టించే వైద్యం. అరుంధతికి తప్పకుండా బిడ్డలు పుట్టే ఉపాయం చేస్తా నన్నది."

"ఆ ఉపాయం పావనికి చేయవచ్చుగా! లోకానికి ఒక యమధర్మరాజు చాలదా అమ్మా!"

"నీ మాటలు నా కర్థం కావడంలేదు. నా జాతకం మూడు నెలల్లో ముగియబోతున్నది. సంతృప్తితో అమ్మ కనులు మూయడం ఇష్టమో, వ్యథతోనే నే సంతంగావడం ఇష్టమో నీవే




తెల్చుకో."

"పావని తప్పేం ఉంది?" మళ్లీ బాపిరెడ్డిని మనస్సు ప్రశ్నించింది.

*** *** ***

బాపిరెడ్డి సౌందర్య దేవతోపాసకుడు. సీతాకోక చిలకలంటే చిన్నప్పటి నుంచీ అతనికి ప్రాణం. ఆల్బంల నిండా ఎన్నో ఉన్నాయి అతను సేకరించిన సీతాకోకచిలకల దేహాల్లూ, రెక్కలూ చిన్నప్పుడు స్వయంగానే పట్టుకుని, పట్టు ఆల్బంలలో భద్రపరచేవాడు. కాని అవి తిండిలేక దీర్ఘకాలం కృశించి చచ్చిపోవడం వల్ల రెక్కలలోని రంగుల మావుదల కొట్ల వచ్చినట్లుగా కనిపించేది.

కొమ్ములు తిరిగి పోట్ల ఎద్దును లొంగదీసుకునే క్రుమ్ములాటలో తండ్రి తల దాని కొమ్ములలో చిక్కుకు పోవడమూ, ఆ తల మొండెం నుండి ఊడి పడే దాకా తండ్రిని ఎద్దు ఆ గోడకు, ఈ గోడకు వేసి బాది, చివరకు గుండెల మీద తొక్కి తలను వేరు చేయడమూ స్వయంగా చూచినప్పటి నుంచి జంతువుల తలల మీద బాపిరెడ్డికి మర్యాద తప్పిపోయింది.



**అలవాటు**

"మీకు కట్నంగా రెండు లక్షలు ఇస్తామంటున్నారండి" అన్నాడు పెళ్లిళ్ళ పేరయ్య.

"అలాగా! అందులో వంద లెన్ని యాభై లెన్ని ఇరవై లెన్ని పదులెన్ని" అని అలవాటుగా అడిగేశాడు ఆ బ్యాంక్ క్యాషియర్.

యక్కటి సుధాకర్‌బాబు, మోపిదేవి [కాకినాడ]

జాల్ జబీర్ మొదలైనప్పటి నుంచి స్వయంగా సీ.చిల్కలను పట్టుకోవడానికి సమయం దొరకడం లేదు.

చిల కొక్కదానికి 10 నుంచి 20 రూపాయల దాకా తను ఇస్తాడు పిల్లలకు. డబ్బు కోసం స్కూలు ఎగ్గొట్టి కూడా సీతాకోక చిలకలను అతనికి తెచ్చిపెట్టడం ఉద్యోగం అయింది పిల్లలకు. పది రూపాయలు చేతిలో పడగానే చిన్నపిల్లవాడి మొగం ఎంత బాగుంటుందో! ఛిన్న మస్తాదేవి మొగంలాగా!

చిలకను తేగానే దాని తలను ఉత్తరించి కొట్టుకునే మొండాన్ని, రెక్కలనూ పట్టు ఆల్బంలో భద్రపరిచేవాడు.

ఒకనాడు "నిండు ప్రాణాన్ని అలా తీస్తా రెందుకు?" అని అడిగింది పావని.

"అది ఆకలితో చావడం నా కిష్టం లేదు. దాని రెక్కల సొంపు.. చచ్చిన సీతాకోక చిలుకను చిరంజీవిని చేస్తుంది."

పావని బుగ్గ ఎరుపు తన పెదవి నునుపును ఎగరేసి పట్టుకుంది.

తన ఆరాధ్య దేవత అయిన 'ఛిన్నమస్త' అవతార మైతేనే తప్ప పావని తన నా ప్రశ్న అడుగజాలదు.

పావని పతితపావనియే... సందేహం లేదు.

తనకు తెలియకపోలేదు. అధఃపతితుడనై పోయానని..

ఆరాధ్య దేవత కాళ్ల క్రింద మూఢశవంగా ఉయి బ్రతుకుతూ ఉన్నానని.. కుమారసంభవమే దీనికి విరుగుడు.

దసరాలు వస్తున్నాయనగా బాపిరెడ్డి కామరూప్ [అస్సాం] వెళ్లి కామాఖ్యాదేవి దర్శనం చేసుకుని వచ్చాడు. కామాఖ్యాదేవి కున్న పది అవతారాలలో బాపిరెడ్డికి నచ్చినది ఛిన్నమస్తాదేవి స్వరూపం. తన తలను ఖడ్గంతో నరుక్కొని, దిగంబరయ్యై, తెగిన తల నొక చేత్తో పట్టుకొని ముగ్గురు శివ స్వరూప మూర్తులపైన నిలబడి నాట్యమాడే దేవి ఆమె. పూజా మందిరంలో ఆమె పటాన్ని బాపిరెడ్డి నిత్యం కొలుస్తుంటాడు.

కామాఖ్యాదేవి సమక్షంలో రోజూ వందలకొద్దీ పశువుల తలలు తెగుతుంటాయి. 'దాన్ని బలిదానంగాను, ఆరాధనగాను భావిస్తా రందరు. జాల్ జబీరులో జరిగే కత్తికోతలకే ఆందోళన చేస్తుంది లోకం!!!

లోకం మాట ఎలా ఉన్నా తన మనస్సే ఎదురు తిరిగి తనను విమర్శిస్తుంది. తండ్రి హయాములో తమకు రెండు వందల పశువు లుండేవి. ఇప్పుడు కాడెడ్ల జత కూడా లేదు.

ఆరోగ్యంగా ఉండే పశువులను నరక కూడదని చట్టా లున్నాయి. డబ్బు కక్కుర్తి కోసం కళ్ళు పొడిచేసీ, కాళ్ళు విరగ్గొట్టీ నరకడానికి అనువైన పశువులుగా చేస్తుంది [మంచి పశువులను] భైరవయ్య ముఠా.'ఇక నీ పశువు కట్టదని సర్టిఫికె ట్టిచ్చే పశువుల డాక్టరు ఒకడు కూడా ఉన్నా డా ముఠాలో.

ఒకనాడు తనకూ, తన మనస్సుకూ జరిగిన వితర్కంలో తండ్రి తన కిచ్చిన రెండు వందల ఎకరాలు తరిగిపోవడానికి తాను చేసిన ఉన్మత్త వ్యవసాయమే కారణ మన్నది - తానే భూమి తల్లి గొంతును గాటబెట్టీ నరికానని దూషించింది మనస్సు. 'ఉన్మత్త వ్యవసాయమ'ని మంచి మాటే అన్నావు కాని, ముద్దుల మనసా! ఆ మాట కర్థమేమిటని ప్రశ్నించా డతను.

"ఏటేటా ఎకరాకు ముప్పయి బస్తాలు పండించాలని నీవు చేసిన భగీరథ ప్రయత్నం. ప్రతి సంవత్సరం రెట్టింపు సంఖ్యలో ఎరువుల బస్తాలు అవసరం కావడంతో లాభం గూబల్లోకి వచ్చి చేసిన ప్రయత్నమూ, పెట్టుబడీ బూడిదలో పోసిన పన్నీరైంది కదా!

"భూగర్భంలోని నీటి మట్టం భూమి ఉపరిభాగపు పచ్చదనం మీద ఆధారపడి ఉంటుందనే మాట మరిచిపోయి, డ్రిప్ కల్టివేషన్ మొరం నేలలో మొదలుపెట్టావు. అసలు నీళ్ళుంటేనా ఏ డ్రిప్పయినా!

"బాంకు నుంచి తెచ్చిన పదిలక్షల రూపాయల అప్పుకు ఇరవై లక్షల వడ్డీ అయి కూర్చున్నది కదా! దాన్ని తీర్చలేక భూములను అమ్మడం ఆరంభించావు. పశువులను కబేళాకు బలిచేశావు.

"నష్టం కూడగట్టుకోడానికి కుక్కగొడుగుల పంటను పండిస్తున్నావు. పరువు తెలియకపోతే పనల్ ఫంగస్ అవుతుందని నీకు జ్ఞానం లేదు. పరువు తెలిసి బ్రతుకు - బ్రతుకంటే రూపాయలు కాదు. బ్రతుకంటే ప్రాణం" అని ముగించింది మనస్సు. బాపిరెడ్డికి కోపం ముంచుకుని వచ్చింది.


"ఈసారి ఇలా ప్రేలావంటే నిన్ను పశువుల గిలెటిన్‌లో పెట్టి నరికేస్తా" నన్నాడు మనస్సును. "పోరా! కుక్కడ్ కా మూత్!" అన్నది మనస్సు.

••• ••• •••

మేనత్త సంతోషానికి హద్దు లేదు. బాపిరెడ్డికి శతత్వం తప్పింది. పావనికి నెల తప్పింది. ఏడో నెల గండమూ గడిచింది.

••• ••• •••

ఎలెక్షనులో పోటీ చెయ్యడానికి బాపిరెడ్డికి స్వంత సీటు దొరికింది. అభ్యర్థి చిహ్నంగా కుక్కగొడుగునే ఎన్నుకున్నాడు. ఓటింగు పేపరు మీద కుక్కగొడుగు ముద్ర పడిపోయింది. పొలంలో




కనిపించే ప్రతి కుక్కగొడుగూ తనకు వేసిన ఓటు లాగానే కనిపించిం దతనికి.

విదేశీ మారకద్రవ్యాన్ని ఇను మిక్కలిగా ఆర్జించి పెడుతున్న జాల్ జబీర్ కబేళాను లోకం ఎందు కలా ఎత్తిపొస్తున్నదో బాపిరెడ్డికి అంతుపట్టడం లేదు. కాశ్మీరం, పంజాబుల్లో జరిగే దైనందిన చిత్రవధలు పుణ్య కార్యాలా? జాల్ జబీర్‌లో జరిగే, జంతువుల చావులు మాత్రమే మహా పాపాలా? బెంగాలులో బ్రతికి ఉన్న తాబేళ్ళను మరిగే నీళ్ళలో ఉడికించి తింటారు. మండల పూజలో తాంత్రిక భూతప్రేత కింకరులు బ్రతికి ఉన్న కోతి నెత్తి మీద సుత్తెలతో తలా ఒక కొట్టు కొట్టీ అందులోని మెదడును చెంచాలతో అరగిస్తారు. ప్రకృతి సహజమైన హింసను తర్కపు రబ్బర్లతో తుడిచి వేయడం ఎలా, ఎవడికి సాధ్యం?

రాజకీయ పార్టీలు జాల్ జబీరును డైరీ ఫారంగా మార్చమనీ, కబేళా పాత్రను తక్షణం ఆపివేయమనీ, దున్నడానికి పశువులు లేని ఈ కటిక కాలంలో మాంసం ఎగుమతి కొరకు కబేళాలు నడపడం దురాగతమనీ ఆందోళన ఆరంభించాయి. ఆందోళనకారులను ప్రభుత్వం నియమించిన రక్షక భట శాంతిసేనలు కాళ్ళూ చేతులూ విరగ్గొట్టీ అవతలకు విసిరేశారు. విదేశీ మారకద్రవ్యం సంగతి ఎలా ఉన్నా, స్వదేశీ ఓట్ల రాబడికి భంగం కలుగుతుందనే భయం వల్ల, జాల్ జబీర్ కబేళాను ఎలెక్షన్లయ్యే దాకా ప్రభుత్వం మూసివేయించింది.

## కుండీతో సహా పువ్వులు

"నీ తల మీద ఈ దెబ్బలు ఏమిటి?"

"మా పై పోర్షన్ నుండి పువ్వులు పడ్డాయి"

"పువ్వులు పడితేనే ఇంత గట్టిగా దెబ్బలు తగిలాయా?"

"పువ్వులు కుండీతో సహా పడ్డాయి మరి."

పిహెచ్.వి.వి.ఎస్.మూర్తి [కొమరగిరిపట్నం]

బాపిరెడ్డి బీదసాదలకు ధోవతులు, లుంగీలు, చీరలు, పాత్ర సామానులు పంచిపెట్టి ప్రచారం సాగించాడు. ప్రభుత్వం సాధించిన ఘనమైన ఆర్థిక విజయాలను, మారక ద్రవ్యాన్నీ వేల కోట్లకు పెంచిన ఘటనాఘటన సామర్థ్యాన్ని వర్ణించబోతే - గొంతులో ఏదో అడ్డుబడ్డది. గొంతు గుర్రు మన్నది. చెప్పు కిర్రు మన్నది.

చేరిన జనంలో ఒకడులేచాడు.

"అయ్యా! మారకద్రవ్యాన్ని వేల కోట్లకు పెంచామని జబ్బలు చరుచుకుంటా రెందుకు? కిలో పదిహేను రూపాయలకు చక్కెర, పదమూడు రూపాయలకు బియ్యం, నలభై రూపాయలకు నూనె, వంద రూపాయలకు నెయ్యీ అమ్ముతున్న ధరల అఘాయిత్యాన్ని మరెందుకు వల్లించుకోరూ? గిడ్డంగులలో ధాన్యాల నిలవలు మురిగిపోతున్నాయని అంటా రెందుకు? ప్రజల కందుబాటులో ఉన్న సరకులను ఎందుకు గుర్తించారు? రోటీ సినిమాలో అందరిని ముంచేసి చంపేసి, రూపాయల సంచులను లారీల కెత్తించుకుని, తూనీగలాగా ఎడారిలోకి పారిపోయిన కథానాయకుడు, దాహానికి గొంతెండి, ఆకలికి కడుపు మాడి చస్తాడు. హర్షద్ మెహతా దగా నీతిని చర్యారూపంగా మీరు సమర్థిస్తున్నారు. మనిషికైనా, దేశానికైనా గుణపాఠం ఒకటే! ప్రభుత్వం తొడుక్కుని నడిచే హిమాలయం చెప్పుల కిర్రు కిర్రులతో పేదవాళ్ళ బొర్రలు నిండవు" అన్నాడు.

పోలీసు సబ్ ఇన్‌స్పెక్టరు వెంటనే అతన్ని అరెస్టు చేసి స్టేషనుకు పంపించేశాడు శాంతి భద్రతల చట్టాన్ని ఉల్లంఘించి ప్రవర్తించినందుకు.

••• ••• •••

కొలీఫ్లవర్లా, కుక్కగొడుగులా అని భ్రాంతిని కలిగిస్తున్న పంట పొలాన్ని చూడాలని మనసుపడ్డది పావని.

"నువ్వు నడవలేవు. నర్సింగుహోమ్‌లో చేర్చడానికి ఇక రెండే రోజుల వ్యవధి ఉంది. అందాకా నీవు కదలకుండా విశ్రాంతిగా ఉండా"లని లేడీ డాక్టరు చెప్పింది. "రోజూ తింటున్నావేగా వాటిని. చూడడాని కే మున్నది?" అన్నాడు రెడ్డి.

"పనివాళ్లు మాట్లాడుకుంటుంటే విన్నాను. డెత్ కప్ వెరైటీ ఏదో పొలంలో మొలచిందట. దాన్ని చూద్దామని ఉంది. ఒక్కసారి వెళ్లివద్దాం."

బలవంతంగా వస్తున్న ఆవులింతను నవ్వుగా మార్చి 'ప్లీజ్' అన్నది పావని.

బాపిరెడ్డి ఆ రోజు ప్రొద్దున అర్జెంటుగా ఎలెక్షను మీటింగుకు హాజరుకావలసి ఉంది.

"వాళ్ళ మొహం. డెత్ కప్ వెరైటీ మన పొలంలో ఎలా మొలుస్తుంది? అయినా ఇవాళ వీలుపడదు. రేపు వెళ్దాం" అంటూ లేచి వెళ్లబోయాడు.

పావని అతని రెండు కాళ్లూ పట్టుకుని నేలాడింది.

ఏదో అర్థంకాని మార్పు ఆమెలో వస్తున్నది. చకితు డయ్యాడు రెడ్డి.

"నా జావొ సైంయా, ఛుడాకె బైంయా, కసమ్ తుమ్హారీ మై రో పడుంగీ - రో పడుంగీ" అంటూ ఏడుపు మొగంతో మీనాకుమారిలాగా పాట పాడడం ఆరంభించింది.

"మధ్యకొండలూ, గుట్టలూ కొల్లేటి సరస్సులూ అన్నీ దాటాలి కదా!" పావని కళ్లలో మత్తు మైకం ముంచుకొస్తున్నట్లు కనిపిస్తున్నది.

"నీవు శాంతంగా పడుకో! అరగంటలో తిరిగి వస్తాగా! ఇద్దరం కలిసి పొలానికి వెళ్దాం."

"సరే! తొందరగా రండి". అని గొణిగింది పావని.

ఆదరాబాదరాగా బాపిరెడ్డి కారెక్కి వెళ్లిపోయాడు. రెడ్డి పోక పావనికి షా కయింది.

పావనికి ఒంటి నిండా ఎవరో సూంచు సూదులు గుచ్చుతున్నట్లుంది. ఎవరో వెన్నెముకలో పొడుస్తున్నారు. జిలా మంటా పెరుతూ చర్మం అస్థిపంజరం నుంచి విడిపోతున్నది. మాంసం ఉడికిపోతున్నది. నరాలు పెట పెట తెగిపోతున్నాయి. ఈ యెతారం బయట చల్లగాలి తగిలితేగాని తగ్గేటట్లు లేదు. ఎవరో తోసేసినట్లుగా వాకిట్లోకి పావని పరుగెత్తుకుని వెళ్లింది.

పొలం బంగళా పావనికి కొత్త చోటేమీ కాదు. అంతా పోగా మిగిలిన సలభై ఎకరాలలో ఇరవై ఎకరాల కుక్కగొడుగు, పది ఎకరాలలో మేకల మందలూ, పది ఎకరాలలో జాల్ జబీరూ నిర్మించుకుని కాలక్షేపం చేస్తున్నారు. బస్తీ నుంచి నాలుగు రోజులైంది పొలం బంగళాకు వాళ్లు వచ్చి. క్రిందటి రాత్రి వాన కురిసి అక్కడక్కడ నీళ్లు నిలిచాయి.

పావని చాలాసార్లు అదివరకు వచ్చి చూచిన చోట్లే అయినా ఇప్పుడు గోడలు కొండల్లాగానూ, మడుగులు మహా సముద్రాల లాగా కనిపిస్తున్నాయి. ఊగుతూ తూగుతూ పొలంలో జొరబడింది పావని.

కుక్క గొడుగుల తలలతో ఉడికిపోతున్నది పొలం. అవన్నీ తన ఒంటిమీదికీ, మొగం మీదికీ, చర్మం మీదికీ ప్రాకి వస్తున్నట్లనిపించింది. శరీరం బుడగలై ఉడకడం మొదలైంది. భయం వేసింది పావనికి. వెనక్కు తిరిగింది. ఇంట్లోకి పరిగెత్తాలని అరడుగుల గంతువేసింది. దారికడ్డంగా పెద్ద గుండు నలుగురు కలిసి ఎత్తినా లేవనిది నిలబడి ఉంది. తనను రాక్షసి బలం ఆవహించింది. కసితో ఆ గుండును ఎత్తి అవతలకు విసిరేసింది.

నిండు చూలాలు పావని. ఆ భారీ పనికి తట్టుకోలేకపోయింది. ఒక్క కేక వేసి స్మృతి తప్పి వెనక్కు పడిపోయింది. హఠాత్ప్రసవమూ జరిగింది. తల్లికీ, పిల్లవాడికీ ఒళ్లూ మొగమూ అంతా గొడుగుల బుడగలే.

అందరూ చుట్టూ చేరారు.

కోడలు ప్రసవించిందని విని, సంతోషంతో మేనత్త కూడా పరుగు పరుగున వచ్చింది. ఆ దృశ్యాన్ని చూచి ఆఖరి ఊర్పు విడిచింది.

ఎగారికస్ ముస్కారిన్ విషం వల్ల పావనీ శిశువూ మరణించారనీ, మేనత్త షాకు వల్ల చచ్చిపోయిందనీ పోస్టుమార్టం రిపోర్టు విశదీకరించింది.

"పాలక కీలక యంత్రాంగంలో భామాకలాపం పోటీలూ.

"కూలీ నాలీ మందే కడుపుకు కుక్కగొడుగు బన్ రొటీలూ."

## అద్భుత వ్యక్తి ఆంధ్రకేసరి!

ప్రకాశం పంతులుగారు రాజకీయాల్లోకి రాకమునుపు మంచి పేరుగన్న న్యాయవాది. అతని వాద పటిమకు ఆనాటి ఆంగ్ల న్యాయమూర్తులు అబ్బురపడిపోయేవారు. ఆంధ్రకేసరికి తన వృత్తి మీద శ్రద్ధాసక్తులు ఏపాటివంటే - ఒకసారి కోర్టులో ఒక కేసును వాదిస్తున్నారు పంతులుగారు. విజయం పంతులుగారినే వరించే సూచనలున్న సమయంలో తన ఒక్కగానొక్క కుమారుని మృతి వార్తను పంతులుగారి చెవిలో ఎవరో వేశారు. అటు ముద్దుల కుమారుడు, ఇటు కాసేపు వాదిస్తే గెలిచే కేసు! గుండె దిటవు చేసుకుని, కేసుని మరింత ధాటిగా వాదించి ఆ కేసును గెలిపించి, ఆఘమేఘాల మీద ఇంటికి చేరారు పంతులుగారు. కాని, పంతులుగారు విన్నట్లుగా కుమారుడు చనిపోలేదు. బ్రతికే ఉన్నాడు. మరి ఆ మృతి వార్త సంగతేందయ్యా అంటే, కోర్టులో పంతులుగారు కేసు గెలవబోయే సూచనలను పసిగట్టి, ప్రత్యర్థి వర్గంవారు పన్నిన పన్నాగ మది! కాని వృత్తికి అంకితమైపోయిన పంతులుగారి ముందు వారి పన్నాగం ఫలించలేదు.

దాసరి బాలయ్య [అనంతపురం]

